ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ



రాహుల్ ప్రదీప్ గురుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప పడిపూజలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్‌లో రాహుల్ ప్రదీప్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడి పూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. పీఏసీ చైర్మన్, శేరి లింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హాజరయ్యారు. అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆ ప్రాంతమంతా అయ్యప్ప నామ స్మరణతో మారుమ్రోగింది. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు ఎండీ ఇబ్రహీం, పోతుల రాజేందర్, కొండా విజయ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: మోతీనగర్ ప్రధాన రోడ్డులోని శ్రీ మంజు హాస్పిటల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డా. అశ్విని కుమార్ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఓపీడీ, ఐపీడీ, వాక్సినేషన్, గ్రోత్ డెవలప్‌మెంట్, సీజనల్ వ్యాధులతో పాటు సాధారణ వ్యాధులకు కూడా చికిత్స చేయనున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కుత్బుల్లాపూర్: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి సూచించారు. సుచిత్రలోని లయోలా డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త చట్టాలు వచ్చాయని, ప్రతి వాహనదారుడు తప్పకుండా నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా రాంనగర్ ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో తులసినగర్, ఆదిత్యనగర్, శ్రీరాంనగర్, సాయి చరణ్ కాలనీ, సాయి ప్రశాంత్ నగర్, కృష్ణవేణి నగర్, ఇంద్రానగర్, ఇంద్రా హిల్స్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మోతీనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాకేష్ గౌడ్ తెలిపారు. 11 కేవీ పర్వత్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వివేకానందనగర్, పర్వత్‌నగర్, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతాలు, అల్లాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు గాయత్రినగర్, జ్యోతి నగర్, చంద్ర గార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మూసాపేటలో...

మూసాపేట: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ భీమ లింగప్ప ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ హబీబ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పవర్‌నగర్ పార్క్, ఆంజనేయ నగర్ రోడ్డు 3, 4 హబీబ్‌నగర్ మసీదు, శ్రీహరి నగర్, ఇంద్రప్రస్థ అపార్టుమెంట్స్, మున్సిపల్ కార్యాలయం వెనుకవైపు, వేంకటేశ్వర ఆలయం, వసుంధర హాస్పిటల్ వెనుక, ప్రగతి నగర్, రోడ్డు నెంబర్ 3 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ శంషీగూడలో సీసీ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సత్వరమే పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, రఘు, ప్రవీణ్, రామరాజు, సాయికిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల కోసం కార్పొరేటర్ వినతి



జలమండలి జిల్లా జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో బస్తీ, కాలనీల్లో పురాతనంగా ఉన్న డ్రైనేజీ పైపులైన్ స్థానంలో ఆధునీకరణమైన పైపు లైన్లు ఏర్పాటు చేయాలని బుధవారం జలమండలి జిల్లా జనరల్ మేనేజర్ ప్రభాకర్‌కు అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం వినతిపత్రం అందజేశారు. జనాభా పెరగడంతో నాటి పైపులైన్ వ్యవస్థ సరిపోవడం లేదన్నారు. సమస్యను విన్న జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించారని, త్వరలో డివిజన్‌లో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని తెలిపినట్లు కార్పొరేటర్ తెలిపారు.



గూడ్స్‌షెడ్ రోడ్డులో..

నిర్వహణ లోపం.. నిరుపయోగం

అపరిశుభ్రంగా పబ్లిక్ టాయిలెట్స్

మూసాపేట సర్కిల్ పరిధిలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ లేకపోవటంతో అలంకార ప్రాయంగా మారాయి. లక్షలు వెచ్చించి పలు ప్రాంతాల్లోని రోడ్లపై ఏర్పాటు చేశారు. నిర్వహణ లేకపోవటంతో పూర్తిగా శిథిలమై ఉపయోగంలో లేకుండా పోయాయి. లక్షల రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్లు పట్టించుకోకపోవడంతో పనికిరాకుండా పోయాయి. కొన్ని చోట్ల నల్లాలు, పైపులు ధ్వంసమయ్యాయి.అధికారులు స్పందించి వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

– మూసాపేట

- పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టర్
- ప్రారంభంలో మాత్రమే పర్యవేక్షణ

మూసాపేట సర్కిల్ పరిధిలో సుమారు 93 పబ్లిక్ టాయిలెట్స్‌ని ఆయా కూడళ్ల వద్ద, జన సంచార ప్రాంతాల్లో, స్థానికులు వాకింగ్ చేసుకునే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన ప్రారంభంలో వాటి నిర్వహణ బాగానే ఉండటంతో ప్రజలకు ఎంతో ఉపయోగపడింది. కానీ కొన్ని నెలలుగా వాటి నిర్వహణ లేకపోవడంతో మరుగున పడిపోయాయి. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువుపై ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు వాకింగ్ చేస్తూ ఉంటారు. వారికి అనుకూలంగా ఉండేందుకు సుమారు 4 పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. ఈ నాలుగు కూడా అధ్వాన స్థితిలో ఉన్నాయి. కపబోర్డ్స్ పగిలిపోయి, నల్లాలు వంగిపోయి అక్కడ కనీసం నిల్చోడానికి కూడా వీలు లేనంత దుర్గంధం, దుర్వాసనగా వస్తుందని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అల్లాపూర్ డివిజన్‌లో సుమారు 8 పబ్లిక్ టాయిలెట్స్ ఉండగా.. అవి పూర్తిగా పనికిరాకుండా పోయాయి. మూసాపేట డివిజన్‌లోని గూడ్స్‌షెడ్ రోడ్డులో 3, వడ్డెర బస్తీలో 1 కూడా శిథిలావస్థకు చేరాయి. సర్కిల్ పరిధిలో ఉన్న 93 టాయిలెట్స్‌లో 90 శాతం ఉపయోగించడానికి వీలు లేకుండా ఉన్నాయి.



ఐడీఎల్ చెరువు కట్టపై నిరుపయోగంగా మారిన పబ్లిక్ టాయిలెట్స్



శిథిలావస్థకు చేరిన పబ్లిక్ టాయిలెట్

నిర్వహణ లేక ఇబ్బందులు



ఐడీఎల్ చెరువు కట్ట వద్ద వాకర్స్‌కు పబ్లిక్ టాయిలెట్స్ ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. కానీ వాటి నిర్వహణ లేకపోవటంతో కొన్ని నెలలుగా వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. చుట్టు పక్కల వాకింగ్ చేయటానికి కూడా వీలులేనంతగా దుర్గంధం, దుర్వాసన వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పబ్లిక్ టాయిలెట్స్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి.

– మనోహర్, వడ్డెరబస్తీ, మూసాపేట

దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలో ఉద్యోగ అవకాశాల్లో భాగంగా స్టెనో/టైపిస్ట్ (01), రికార్డు అసిస్టెంట్ (01) పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

1 స్టెనో/టైపిస్ట్ పోస్టుకు డిగ్రీ అర్హతతో పాటు షార్ట్ హ్యాండ్ (హయ్యర్) నిమిషానికి 120 పదాల స్పీడ్ ఉండాలని, ఇంగ్లీష్ (హయ్యర్)ని మిషానికి 45 పదాల టైప్ వచ్చి ఉండాలన్నారు. రికార్డు అసిస్టెంట్ పోస్టుకు పదోతరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న సాయంత్రం 5 గంటల లోగా రిజిస్టర్ పోస్ట్/స్పీడ్ పోస్ట్ ద్వారా చైర్మన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, మేడ్చల్–మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ కోర్ట్ కాంప్లెక్స్ అడ్రస్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు చిల్డ్రన్స్‌డే ఎడ్యుకేషన్ ఎక్స్‌పో

చింతల్: చిల్డ్రన్స్ డే సందర్భంగా నెహ్రూ నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం చిల్డ్రన్స్‌డే ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు గెజిటెడ్ హెచ్‌ఎం, ఎంఈఓ జెమిని ఎస్ఎస్ కుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి డీఈఓ విజయకుమారి ముఖ్య అతిథి గా హాజరుకానున్నట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: ఆటోలో ప్రయాణిస్తున్న వారిని క్షేమంగా గమ్యం చేర్చడంతో పాటు సమాజం పట్ల సామాజిక స్పృహతో వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి ఆటో డ్రైవర్‌పై ఉందని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడ్డగుట్ట ఆటోస్టాండ్, జేఎన్‌టీయూ ఆటో స్టాండ్‌ల వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారిపై జరిగిన అఘాయిత్యాలను గుర్తు చేస్తూ అలాంటి పరిస్థితులు తిరిగి మరోమారు ఉత్పన్నం కాకుండా ప్రతి ఆటో డ్రైవర్ కృషి చేయాలన్నారు. ఆటో స్టాండ్‌కు వచ్చే ప్రతి ఆటో రిజిస్ట్రేషన్ నెంబర్, యజమాని పేరు, డ్రైవర్ పేరు, గుర్తింపు కార్డులను సరిచూసుకోవాలన్నారు. ప్రతి ఆటోకు సీరియల్ నెంబర్ కేటాయించి, దానిని కూడా అందరికీ కనిపించేలా ఆటోపై అతికించాలన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన అనుమానాస్పద ఆటోలను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆటో ప్రమాదాల నివారణపై, సమాజంలో చోటు చేసుకుంటున్న సంఘటనలపై అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

మర్యాద ఇవ్వడం లేదని... విద్యార్థినిపై చేయి చేసుకున్న విద్యార్థి

దుండిగల్: తనకు మర్యాద ఇవ్వడం లేదనే అక్కసుతో విద్యార్థినిపై తోటి విద్యార్థి చేయి చేసుకున్నాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన దినేష్ పాల్వంచ(27) బహదూర్‌పల్లిలోని టెక్ మహేంద్ర యూనివర్సిటీలో బీబీఏ జర్నలిజం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తోటి విద్యార్థిని తనకు మొదటి నుంచి మర్యాద ఇవ్వడం లేదని ఆగ్రహించాడు. దినేష్ కళాశాలలో ఆమెపై చేయి చేసుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యంత్రంలో పడి కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్: ప్రమాదవశాత్తు యంత్రంలో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం హాజీపూర్‌కు చెందిన శివశంకర్ పాశ్వాన్(33) జీడిమెట్ల పారిశ్రామికవాడలోని గోవర్ధన్ అట్టల తయారీ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం అట్టలు కత్తిరించే మిషన్‌ను ఆపరేట్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కుని మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే సమయాన్ని.. కుటుంబ సభ్యులకు ముందే చెప్పాలి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్

సాక్షి,సిటీబ్యూరో: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు వచ్చే సమయాన్ని ముందుగానే కుటుంబాలకు తెలిపి, అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచుకునేలా సంబంధిత సర్వే నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ సూచించారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ వీసీహాల్‌లో కుటుంబ సర్వే, ధాన్యం సేకరణ అంశాలపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్యుమరేటర్లు డాక్యుమెంట్లు చూసి తప్పులు జరుగకుండా ఫారాలను పూరించాలని, ఏదైన సందేహాలు ఉంటే సూపర్ వైజర్, నోడల్ అధికారి దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ రూపొందించుకుని సర్వే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎన్యుమరేటర్లను ఆదేశించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో వలసదారులు ఎక్కువగా ఉన్నందున వారు స్వచ్ఛందంగా కోరిన చోట నమోదు చేయించాలన్నారు. ఎన్యుమరేటర్లు కుటుంబ సభ్యులతో సౌమ్యంగా మాట్లాడి సమాధానాలు తెలుసుకుంటూ, ప్రత్యక్షంగా పరిశీలించిన అంశాలను ప్రొఫార్మాలో పూరించాలన్నారు. సర్వే నిర్వహణలో కలిగే ఇబ్బందులపై నోడల్ అధికారులు చొరవ తీసుకొని పరిష్కరించాలన్నారు. దీనికి ముందు జిల్లా నోడల్ అధికారులతో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు అందజేశారు. జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమాచారాన్ని ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్‌కు జిల్లా కలెక్టర్ గౌతమ్ వివరించారు. జిల్లాలో గ్రూప్–3 పరీక్షలు ఉన్నందున సర్వే పూర్తి కావడానికి ఇంకా కొంత సమయం అవసరమవుతుందని కలెక్టర్ తెలిపారు. సమవేశంలో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీఓలు సైదులు, శ్యాం ప్రకాష్, డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖాధికారి స్వర్ణలత, జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరా డీఎం సుగుణబాయి, జిల్లా యువజన శాఖాధికారి గోపాల్ రావు, జిల్లా మత్స్య శాఖాధికారి సుకీర్తి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి బాబు మోసెస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా క్యాంటీన్‌ను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ పరిశీలించారు. క్యాంటీన్‌లో ఉన్న ఆహార పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్‌తో సహా వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాల రుచి చూస్తున్న దివ్య దేవరాజన్

రాంనరేష్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా



పీఏసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్ కాలనీ వాసుల సమస్యలను పరిష్కరిస్తానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఈ మేరకు కాలనీవాసులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే కాలనీలో పర్యటిస్తానని తెలిపారు. అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి వ్యవస్థను మెరుగు పరుస్తామన్నారు. కాలనీలో అవసరమున్న చోట వీధి దీపాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పోతుల రాజేందర్, వెంకటేష్‌యాదవ్, సత్యనారాయణ, చాట్ల రవి, బ్రహ్మయ్య, మహేందర్ రెడ్డి, రాజా నరేంద్ర, అర్జున్‌రెడ్డి, మాల్లారెడ్డి, మురళి, భుజంగం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పటోలా మేళా.. భళా..!



సాక్షి, సిటీబ్యూరో : బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 1లో లేబుల్స్ పాప్–అప్ స్పేస్‌లో డిసన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంటున్నది. వెడ్డింగ్ ప్రత్యేక కలెక్షన్ వేదికగా ఏర్పాటైన ప్రదర్శనలో రాజ్‌కోట, పటోలా దుపట్టా, పటోలా శాలువాలు, సింగిల్ పటాన్ చీరలు, సింగల్ పటాల్ చీరలు, సింగల్ పటోలా దుప్పట, పటాన్ చీరలు, సిల్క్ టిష్యూ పటోలా వంటి 10 వేల రకాల ఉత్పత్తులు మగువల మనస్సు దోచేస్తున్నాయి. పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రోత్పత్తులు నేరుగా వినియోగదారులకు అందించేందుకే ప్రదర్శన ఏర్పాటు చేశామని, ఈనెల 16 వరకు కొనసాగుతుందని డిసన్స్ పటోలా ఆర్ట్స్ నిర్వాహకుడు భవిన్ మక్వాన్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిజాంపేట్: ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, తూముకుంట మండలం, విపన్‌గండ్ల గ్రామానికి చెందిన నాగరాజు 15 సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చి నిజాంపేట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. రెండు వారాల క్రితం నాగరాజు కావ్యా లేఅవుట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా చేరాడు. ఈ నెల 4న అపార్ట్‌మెంట్ మూడవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సంగీ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

దుండిగల్: ఆటో డ్రైవర్లు వాహనాలను నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు దుండిగల్, సూరారం తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో బుధవారం ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని సూచించారు. విద్యార్థినులు, మహిళల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదిలికలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సరైన పత్రాలు లేని ఆటోలను పోలీస్ స్టేషన్లకు తరలించారు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ సతీష్, ఎస్ఐ శంకర్ పాల్గొన్నారు.

మత విశ్వాసాలను పరస్పరం గౌరవించుకోవాలి



సమావేశంలో బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సీఐ నరసింహరాజు తదితరులు

బాలానగర్: ఒకరి మత విశ్వాసాలకు మరొకరు భంగం కలిగించకుండా పరస్పరం గౌరవించుకోవాలని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు అన్నారు. బుధవారం నర్సాపూర్ చౌరస్తాలో సీఐటీడీ సమావేశ మందిరంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రార్థన మందిరాలు, ఆలయాలు, మసీదుల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు నిందితులను పట్టుకోవడానికి, వారిని శిక్షించడానికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. స్నేహభావంతో ఉండాలని సీఐ నరసింహరాజు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర కార్యవర్గం అత్యవసర భేటీ

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర అత్యవసర కార్యవర్గ సమావేశం ఈ శుక్రవారం పీర్జాదిగూడ (ఉప్పల్ డిపో వెనుక)లో విజయరత్న హైస్కూల్‌లో ఉదయం 11 గంటలకు జరగనున్నట్లు టీయూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి జంకిటి కైలాసం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర కార్యవర్గ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లా శాఖలు, కార్యవర్గ సభ్యులు హాజరై, భవిష్యత్ కార్యక్రమం నిర్వహణ కోసం తీర్మానాలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.